# జీవితరంగం

## – స్వరాజ్య పద్మజ కుందుర్తి



వందేళ్ళ క్రిందట.. ఇద్దరు అమ్మాయిలు, పదేళ్లకే వితంతువులయ్యారు, అమ్మానాన్నలు లేరు, నమ్మినవారు ఆస్తి అంతా దోచేశారు, జీవితాంతం ఎలా గడపాలి? జీవితపోరాటాన్ని కొనసాగిస్తూనే గాంధీగారి పిలుపునందుకుని స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు, ఎక్కడో బహిరంగసభలో తలిదండ్రులనుంచి తప్పిపోయి ఏడుస్తున్న పసిపాపను అక్కున చేర్చిపెంచుకున్నారు, ఒకవైపు తమదైన జీవనపోరాటం, మరోవైపు దేశంకోసం పోరాటం.. వీళ్ళు చరిత్రపుటల్లో కనిపించకపోవచ్చు, పెద్దల ఉపన్యాసాల్లో వినిపించకపోవచ్చు.. కానీవాళ్ళు ప్రదర్శించిన ఆ పోరాటపటిమ గురించి తెలుసుకుంటుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది, నిలువెత్తు స్ఫూర్తిశిఖరాలు కళ్ళముందు కదులుతాయి. వాళ్ళపేర్లు- కనుపర్తి హనుమాయమ్మ,కొండా సత్యవతమ్మలు. అలనాటి వాస్తవ సంఘటనలను వారి మనవరాలు స్వరాజ్య పద్మజకుందుర్తిగారు నెలనెలా కథన రూపంలో మనకందిస్తున్నారు.



కనుపర్తి హనుమాయమ్మగారు



కొండా సత్యవతమ్మగారు

## భాగ్యనగరం చూడరబాబూ ....

ఆ సాయంత్రపువేళ అందరూ హడావుడిగా టైం అయిపోతోందితొందరగా ఆన్ చేయండి అంటూ హాల్లోకి చేరారు. నా కొత్త స్నేహితురాలు కూడా నన్ను చెయ్యిపట్టి హాల్లోకి పరుగుతీయించింది పెద్దవాళ్ళంతా కుర్చీలలోనూ పిల్లలం కింద కూచున్నాక బసవరాజుగారు అప్పటిదాకా కప్పివుంచిన గుడ్డ తొలగించేసరికి ,రేడియో కన్నా చాలా పెద్దగా ముందు అద్దం తో ఉన్న పెట్టె బైటపడింది.

ఔను! అప్పటి దాకా నేను వినటమే గానీ అంటవరకూ నేను చూడని విచిత్రం! మాటల తో బాటూ బొమ్మలు కూడా కనిపించే T V! నా ఆశ్చర్యానికి అంతులేదు. హైదరాబాదు వచ్చిన రోజే ఇంత విశేషం నా కళ్ళ బడుతుందని అనుకోలేదు. ఆరోజు తెలుగు సినిమా అట! నాకు బాగా గుర్తు. ఆరోజు నేను చూసింది 'స్వర్గసీమ ' సినిమా. భానుమతి, నాగయ్యగారూ అనుకుంటా మిగిలిన ఆర్టిస్టులు గుర్తులేరు. కళ్ళూ నోరూ తెరుచుకుని చూస్తుంటే ....అమ్మగారు అంటే బసవరాజుగారి భార్య మాకు అక్కడికే కంచాల్లో అన్నం తెచ్చి పెట్టింది.

అంత చిన్న బొమ్మలతో నేను సినిమా చూడటం ఆరోజే. కాసేపటికి కళ్ళు మంటలు వచ్చేసి సినిమా పూర్తయేసరికి అక్కడే నిద్రపోయాను. తెల్లారి లేచేసరికి వైరునవారు మంచం లో పెద్దమ్మమ్మ పక్కన ఉన్నాను. ఫాను గాలికి మొహమంతా ఆవిరెక్కిపోయి వళ్ళంతా పట్టేసి ఏదోగా అనిపించింది. కాలకృత్యాలకు కూడా దూరంగా హాయిగా పొలాల్లోకి వెళ్ళేవాళ్ళం కానీ ,అక్కడే పాయఖానాలో కంపుకొడుతూ ..వెళ్ళాలంటే చాలా ఇబ్బందిగా అనిపించింది. పాలుకూడానీళ్ళ లాగా కంపుకొడుతున్నాయి. తాగలేకపోయాను.

పొద్దుటే తొమ్మిది గంటలకల్లా వంటావిడ అందరికీ వంటచేసింది. పెద్దమ్మమ్మ మాత్రం తనే చిన్న గిన్నెతో అన్నమూ పప్పూ వండుకుని ,రోట్లో పచ్చడేదో నూరుకుంది. బసవరాజుగారు నొచ్చుకుని "అదేంటి బామ్మగారూ వచ్చినప్పుడల్లా మీరే వంట చేసుకుంటారూ వంటావిడ మడితోనే వంటచేస్తుంది కదా?" అన్నా "అదేంలేదులేవయ్యా నా అలవాటు అంతే "అని సున్నితంగా చెప్పింది. ఇంట్లో తప్పితే బైట ఎక్కడా ఎవరి చేతి భోజనం తినేది కాదు తను. తనవెంట ఎప్పుడూ చిన్న కుంపటి మోసుకెళ్ళేది. వెళ్ళిన చోట ఉప్పూ పప్పూ తీసుకుని తనవంట తనే చేసుకునేది.

లాయర్ బసవరాజుగారి ఆఫీసు రూములో కూర్చుని ఇద్దరూ మాట్లాడు కోవటం విన్నాను. "అది వూరికి ఎంతో ఉపయుక్తమైన మంచినీటి చెరువనీ, దానిలోనించి పదెకరాలు మీకు ఇచ్చేస్తే ఊరికి చాలా ఇబ్బంది ఔతుందనీ, పొలాలకు నీళ్ళులేక ఎండిపోతాయనీ మీ ఊరి కరణమూ ఇంకొంతమంది రైతులూ కలిసి హైకోర్ట్ లో పిటీషన్ వేసారు బామ్మగారూ ..టూకీగా అదీ విషయం" చెప్పాడు బసవరాజుగారు.

"అదేంటయ్యా అదసలు చెరువేకాదు. చెరువు ఇంకో అరమైలు ముందువుంది ఇది చెరువుకు ఎగువ పొలం. అయినా మావూరుకు నందికొండ కాలువ ఉంది పెద్దకాలువ మా ఊరి పక్కనుంచే పోయేది. ఎగువ పొలాల్లో నీరు ఎక్కువై చెరువుకు మా పొలం నుంచే పారతాయి నీళ్ళు. అంతా అబద్ధం! చెరువు నీరు వాళ్ళకు అవసరం లేదు. వాళ్ళనీళ్ళే చెరువులోకి వస్తాయి "అంది పెద్దమ్మమ్మ ఆవేశంగా.

"బామ్మగారూ అదంతా కోర్టుకు తెలియదు కదా! చెరువులు ఆక్రమించడం నేరం అంటుంది కోర్టు. అది చెరువు కాదని తేల్చవలసిన బాధ్యత మనది "అన్నాడాయన.

"అటువంటప్పుడు ఆ సర్వే నెంబరులో చెరువే ఉంటే ..గవర్నమెంటు స్వాతంత్ర సమర యోధులకు ఎందుకిస్తుంది చెప్పూ?గవర్నమెంటు తప్పుచేయదు గద ? "లా పాయింటు తీసింది పెద్దమ్మమ్మ.

"అదంతా మీఊరి కరణానికే తెలియాలి బామ్మగారూ. బహుశా సర్వే నెంబరు తప్పురాసి పిటీషన్ వేసి ఉండొచ్చు " అన్నాడు.

"వెధవ కరణీకం బుద్ధులు. తండ్రి మాటవిని చేసినా చేసి ఉండొచ్చు. కొడుకుని కూడా కరిణీకంలోకి దింపాడు. ఇక కొడుకు మహా మేధావి డిగ్రీ చదివాడు. మా అన్న చనిపోయినా, కొడుకు సాయంతో మేనత్తల ఉసురు పోసుకుంటున్నాడు వెధవ! అప్పుడు తండ్రి ఆ రకంగా ఏడిపించాడు, ఇప్పుడు కొడుకు ఈవిధం గా బాధపెడుతున్నాడు "అంది. తన్నుకొస్తున్న ఏడుపుతో పెద్దమ్మమ్మ గొంతు మూగపోయింది.

"తల చెడిన ఇంటి ఆడపిల్లలం. మానాన్న ఇచ్చిన నలభై ఎకరాల పొలం కోసం వాళ్ళ నాన్న అంటే మా దత్తు అన్నగారు మమ్మల్ని పెట్టిన తిప్పలు అన్నీ ఇన్నీ కావు నాయనా...చివరికి నిస్సహాయులమై, అయిన కాడికి ఆసాములకు అమ్ముకోవలసి వచ్చింది. ఈ నేదరి పిల్లలని బతికించుకో వాలంటే అంతో ఇంతో భూమి లేకపోతే ఎలాచెప్పు? అదీ స్వాతంత్రోద్యమం లో మాసేవలకు గుర్తింపుగా సర్కారు వారిచ్చిన పొలం! వీడి అబ్బసొమ్మేమీ కాదు! అయినా వాడికి మామీద ఇంతద్వేషం ఎందుకు నూరిపోసాడో వాళ్ళ నాయన" నిట్టూర్చింది మా పెద్దమ్మమ్మ.

"బాధపడకండి బామ్మగారూ! నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. మీకెలాగూ ఇంజనీరు 'కే .యల్ రావు 'గారు తెలుసు అన్నారుగా ...ఆయన చేతకూడా ఈ పొలం సాగుకు అభ్యంతరమేమీ లేదని ఒక కాయితం రాయించుకు రండి. అదిమనకు బాగా ఉపయోగ పడుతుంది. ఆయన ఒక్క ఫోన్ చేసారంటే దెబ్బకు ఇక్కడి పంచాయతీ రాజ్ ఇంజనీర్లు వణికిపొతారు. మనకు అభ్యంతరాలన్నీ తొలగిపోయే అవకాశముంది. మీరా ప్రయత్నం లో ఉండండి " అన్నాడాయన.

"సరే అయితే పిల్లని వాళ్ళ అక్కదగ్గర దింపి, నేను ఢిల్లీ వెళ్ళి రావు గారిని కలిసి వస్తాను. మళ్ళీ నెల తర్వాత కనిపిస్తాను." అని ఆయన దగ్గర శలవు తీసుకుంది పెద్దమ్మమ్మ. అక్కడి నుంచి ఇద్దరం గాంధీ భవన్ కు వెళ్ళాం. అక్కడ ఒక పెద్దాయన పంచె కట్టుకుని ఖాదీ చొక్కావేసుకుని కుర్చీలో కుచోని ఉన్నాడు. వింతగా పేద్దపేద్ద స్తంభాలు దాటుకుంటూ వెళ్ళానేమో, అదేదో రాజభవనంలా అనిపించింది నాకు. గోడవారగా చెప్పులు విప్పి కర్ర పోటు వేసుకుంటూ వచ్చిన పెద్దమ్మమ్మను చూస్తూనే ..."నమస్కారం బామ్మగారూ ఏమిటిలా వచ్చారు?"అని పలకరించాడాయన .

"ఏం చెయ్యమంటావు బాబూ! దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదనీ, ప్రభుత్వం పదెకరాలిచ్చినా అవి మాకు రావటానికి నడిమధ్య ఎన్నిమంత్రాంగాలనీ."

ఆయన ఎందుకనో కాస్త వ్యగ్యంగా నవ్వి నన్ను దగ్గరిగా చేత్తో పిలుస్తూ, "ఈ అమ్మాయి ఎన్నో మనవరాలూ?" అన్నాడు.

"అది ఏడో సంతానం. దీని ముందు మొగపిల్లవాడు, ఆడపిల్లలు ఏడుగురిలో ఇది ఆరోది. పేరు స్వరాజ్య పద్మజ .ఆగష్టు పదిహేనున పుట్టింది." పరిచయం చేసింది అమ్మమ్మ.

ఆయన సర్దాగా నా రెండు జళ్ళూ పట్టుకుని ఊపి "జాగ్రత్త బాగా చదువుకో ...మంచిపుస్తకాలు కొనుక్కో" అని ఒక యాభై రూపాయల కాగితం నా చేతిలో పెట్టి వెళ్ళిపోయారు.

అమ్మమ్మ తరువాత అక్కడ ఎవరితోనో కే.ఎల్ రావుగారికి ఫోను చేయించింది. ఇక్కడినుంచీ ట్రంకాలు బుక్ చేసి అమ్మమ్మ మాట్లాడే సరికి రెండు గంటలుపట్టింది. ఆ తరువాత బయటికొచ్చి ...సిటీ బస్సులు రెండు మారి పాత బస్తీలో ఉన్న లక్ష్మక్క వాళ్ళింటికి వెళ్ళాం. "అమ్మమ్మా !అయనెవరూ ?నాకెందుకు డబ్బులు ఇచ్చారూ ?నా ప్రశ్నల పరం పర బస్సులోనే మొదలైంది." ఆశీర్వచనంగా ఇచ్చారు. మంచి పుస్తకాలు కొనుక్కో మన్నారుగా కొనుక్కో ,ఆయన మంత్రిగారు.పీ వీ నరసింహారావు గారు, చాలా మంచివారు .కాకపోతే మనమీద కొంచెం కోపం గా ఉన్నారు .అందుకే సాయం అడగలేకపోయాను" అని నిట్టూర్చింది అమ్మమ్మ.

"ఎందుకూ ..మనమీద కోపం?" అడిగాను.

"నీకు తెలీదులే." దాటవేసింది అమ్మమ్మ. బస్సులో అమ్మమ్మని అంతకంటే అడిగే ధైర్యం లేక మెదలకుండా బైటకు చూస్తూ ఉండిపోయాను.

పాత బస్తీ లో షమ్షేర్ గంజ్ లో ఉండేవాళ్ళు లక్ష్మి అక్కావాళ్ళు. బండరాళ్ళు పరిచి ఉన్న అనేక సందుగొందులు తిరిగి ఎలాగైతేనేం సాయంత్రానికి అక్కవాళ్ళ ఇల్లు చేరాం. మేడ పైన రెండు గదులూ చిన్న వంటిల్లూ ఉన్న ఇల్లు. అక్కడంతా చాలా సందడిగానూ ,మనుషులందరూ చాలా స్నేహం గానూ కనిపించారు నాకు. ఇంటివాళ్ళ అబ్బాయి వెంకట్రావు నా ఈడు వాడే కావటంతో ఆటలకు కొదువలేదు. మోకాళ్ళు దాటిన పేద్ద జుట్టుతో ఇంటి అరుగుమీద చిన్నగిన్నెలో నూనె పెట్టుకుని జుట్టు పాయలుగా విడదీసుకుంటూ నూనె రాసుకుంటుండే ఇంటి వోనర్ గారి భార్య నాకింకా గుర్తు. అక్కడ ఉన్న నెలరోజుల్లో హైదరాబాదంతా తిప్పి చూపించారు బావగారు. చిన్న చేతక్ స్కూటర్ మీద. ముందు ఖాళీలో నేను మోకాళ్ళ మీదా, వెనక మా అక్కా కూర్చుని మాబావగారు నడుపుతుంటే ఝామ్మంటూ హైదరాబాదంతా తిరిగేసాం.

చార్మినారు ఎంతో ఎత్తుగా ఠీవిగా నిలబడి ఉంటే దానిపైకి ఎక్కి కింద చీమల్లా కనిపిస్తున్న మనుషులనీ చిన్నగా కనిపిస్తున్న కార్లనీ చూసి ఎంతో ఆశ్చర్యపోయాను. చార్మినార్ని మొన్నీమధ్య చూస్తే పాపం పొట్టైపోయినట్లు చిన్నగా అనిపించి నవ్వుకున్నాను. ఇంక సాలార్జంగ్ మ్యూజియం ఎంత నచ్చేసిందో చెప్పలేను. గంటకోసారి గడియారం నుంచి బైటకొచ్చి గంటలు కొట్టే అతన్ని చూడటానికి ఎంతమంది వేచిఉండేవారో అక్కడ. అలాగే టాంక్ బండ్ ,చౌ మహల్లాప్యాలెస్ ,ఇలాంటి వింతలన్నీ ఒక ఎత్తూ ,అసలు తెలుగు సరిగా రాక షాపుల మీద ఉండే బోర్డ్ లు ఒకఎత్తూనూ ...ఎన్ని తప్పులు ఉండేవో అన్నీ చదువుకుంటూ నవ్వుకునేవాళ్ళం ...పితీ డ్రస్సెస్. మెడమీద కొట్టు ఇలాంటివి.

ఇంక ఆసందులోనే ఒక నార్త్ ఇండియా కుటుంబం ఉండేది వాళ్ళు ఎంత ఉదారులంటే. ప్రతిరోజూ సాయంత్రం టీ. వీ. ఆరుబయట తెచ్చిపెట్టేవాళ్ళు. ఆసందులో అందరూ అక్కడే కూర్చుని టీ. వీ చూసేవాళ్ళు. ఆడవాళ్ళయితే అక్కడికే రొట్టెల పీటలూ అవీ తెచ్చుకుని టీ. వీ చూస్తూ రొట్టెలు చేసుకునే వాళ్ళు. ఆడవాళ్ళు కొందరు కూరలు తరుక్కునే వాళ్ళు. మగవాళ్ళు ఇళ్ళల్లో నుంచి చైర్లు తెచ్చుకుని వెనగ్గా కూర్చునేవాళ్ళు. తొమ్మిదిన్నర న్యూస్ వరకూ టీ వీ బజారులోనే ఉండేది. కొన్నివాక్యాలు పేపర్ మీద రాసుకుని, మధ్య మధ్యలో కెమేరావైపు చూస్తూ వార్తలు చదివే ఆ న్యూస్ రీడర్లు ఎంత బాగుండే వారో.

ఆవిధంగా నెలరోజులూ గడిపి ఇంక స్కూళ్ళు మొదలు కావటం తో మావూరు నరసరావు పేటకు తిరిగి రాక తప్పలేదు నాకు. వచ్చాక హైదరాబాదు విశేషాలు చెప్పడంతోనే సరిపోయింది నాకు. ఎప్పుడూ ఫ్రెండ్స్ తో "ఏందబ్బా ,అదికాదబ్బా! అని మాట్లాడుకునే నేను రావే పోవే అట్లజేషినవేందే, నాకిది వస్తలేదే నేనిది మస్తు పైసలువెట్టి కొన్ననే ఇలా మాట్లాడేసా."

మా ఫ్రెండ్స్ మాత్రం" అబ్బదీని ఏషాలో ఇదిగాంగ పొయ్యొచ్చిందబ్బా హైద్రాబాదూ. బాసమరీ పీసురేగుతంది దీనికీ" అని మెటికలు విరిచారు. కానీ మనం మాత్రం "హైద్రబాదులో ఐతే గిట్ల దోస్తులను పరెషాన్ జయ్యరు వే. మీరందరు గిట్లజేస్తే మీ దోస్తాన కటీఫ్ అంతే జర్ర సోచాయించుకోండ్రి మల్ల." అని వార్నింగులిచ్చేసా .

*(కొనసాగింపు వచ్చే సంచికలో..!)*

Post your comments